


# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

అక్టోబర్ 2013

సంపుటి : 19 **226** సంచిక : 10




## వైకుంఠవాసుడవై, భక్తోద్ధరణ చేయుటకు, వైకుంఠము వీడిన వాడవై, వేంకటాద్రి నివాసుడవై, భక్తులను బ్రోచే వేంకట విభుడా! నీవే శరణు శరణు !

**శ్రీ వత్స వక్షసం। శ్రీశం। శ్రీలోలం శ్రీకరగ్రహం।**
**శ్రీమంతం। శ్రీనిధిం। శ్రీధ్యం। శ్రీనివాసంభజే। నిశామ్**

– వక్షస్థలమున శ్రీవత్సమనెడు శ్రీకరమైన మచ్చను కలిగి, శ్రీలు ప్రసాదించే లక్ష్మీదేవికి భర్తవై, లక్ష్మీ విలాసులందు ఆసక్తికలవాడవై, లక్ష్మీ దేవిని పరిణయమాడి శ్రీమంతుడవై, శ్రీనిధి శ్రీదేవిలచే స్తుతింపబడే శ్రీనివాసా! నిన్నెపుడూ సేవిస్తున్న శ్రీకరమైనట్టి, నీవు వెలసిన ఆంధ్రభూమిని నరకక్షేత్రంగా చేస్తున్నట్టి రాక్షసుల నెలా సృష్టించ మనసు కలిగిందయ్యా!

**నీవుండే ఏడుకొండలు ఏడు లోకాల గుండెలు!**

**నిన్నే నిరతమూ ఆరాధించేవారి ఆవాసములు!**

**నీ భక్తుల పాదధూళిలో నిరతమూ పవిత్రత సంతరించుకొనే నేలలో రోజులు రోజులుగా చిచ్చులు రేగుతుంటే చూస్తూ మిన్నకున్నావా వేంకటనాధా!**

**కలిసి ఉంటే కలదు సుఖమనే ఉమ్మడి కుటుంబాలు, మడికట్టుకున్న లుంటరి కుటుంబాలయై దూరదూరంగా విడిపోతున్నాయి.**

**ఆ గాలి వీచుణ్ణి తగ్గించమని వాయుదేవునికి చెప్పవయా!**

**తల్లీ బిడ్డలు దూరదూరంగా వేరైపోతున్నారని నీవెరుగవా**

**కృష్ణ ధర్మరాజుల వంటి మనస్కులైన నాయకులు నిండిన ఒకనాటి బంగారుభూమి!**

త్యాగభావకులైన అలనాటి నాయకులు మూడు ప్రాంతాల తెలుగు ప్రజల్నీ ఒక్కటిగా కలిపారు. ఇప్పుడంటావా –

**ఒకరొకరికి మరొకరు పొసగని విద్వేషముం పుట్టింది! చెలరేగింది!**

**ఒకరిపై ఒకరికి కల అనురాగభావము ఆవిరయింది!**

**ఒకరి కోసం మరొకరు త్యాగం చేసే స్వభావమూ సడలింది!**

**ప్రజల సౌభాగ్య, సుఖైకశ్శాన్తుల కోసం, తమ తమ సంపదలను తవ్వి తవ్వి పోసిన తరం పోయింది! ఆత్మీయతానురాగం తెగిపోయింది.**

శ్రీమంతులు దానధర్మముల్జేసి తనువున ఉండే కట్టువస్త్రంతో త్యాగులు, విరాగులై కాలం చేసారు. అటువంటి దేశభక్తుల పాదధూళితో సస్యశ్యామల కోమలమైన పుణ్యభూమి మరుభూమి కానుంది! దేశ దాస్యవిముక్తి కోసం సర్వస్వమూ త్యాగం చేసిన ఆ ఆంధ్రుల తరంలేదు. స్వాతంత్రం సాధించేవరకూ ఉండి, ఆ ఫలాల్ను అందుకోకుండానే వారు శ్వాసలు విడిచారు. వేంకటరమణా! సంకటహరణా! శ్రీరమా రమణా! ఇవి నీవెరిగిన సత్యములే. ఆనాడు ఒక్క మోహన్‌దాసు కరమ్‌చంద్ **(మహాత్మా)** గాంధీనే గాంధీగా చెప్పుకున్నారు. **మహాత్మా** అనుచూ ఆనాడు ఎంతమంది 'గాంధీ'భక్తులు మహాత్మాగాంధీకి అండగా ఉండేవారో! ఇప్పటివారికి అవగాహన లేదు. ఎందరి గాంధేయుల ప్రాణాలు హరించుకుపోయి, దేశ స్వాతంత్రం సిద్ధించిందో ఎవరికి ఎరుక? ఏడుకొండలవాడా! నీకొక్కనికే ఎరుక. ఈనాడు మహాత్మాగాంధీ వంశానికి చెందనివారు నెహ్రూవంశీయులు గాంధీలుగా చెలామణీయవుతూ, రాష్ట్ర విభజనకు నడుము కట్టారు. ఆంధ్రభాషా రాష్ట్ర పోరాటంలో, రాష్ట్రంలోని స్త్రీలు, పురుషులూ, ఎంతెంతటి త్యాగాలు చేసారో! తమ రక్తాన్ని ఎలా లాఠీదెబ్బల కెరచేసారో! ఎవరికెరుక? నీకెరుక స్వామీ!

మనం రక్తంతో సాధించిన స్వతంత్ర భారతదేశంలో, అధినాయకత్వం, అధికారులు, పోలీసులు మనం జరిపిన రాష్ట్రపోరాటం రోజుల్లో మన వారినే లాఠీలతో కొట్టి రక్తం చిందింపజేసి, తుపాకీ గుళ్ళతో ప్రాణాలు తీయడం, ఎంతటి దారుణం?

నెల్లూరు జిల్లాలోని ఆర్యవైశ్య కులంలో పుట్టి, మద్రాసులో 56 రోజులు ఆమరణ దీక్షచేసిన పొట్టిశ్రీరాములుగారు ప్రాణాలను ఆహుతి చేసుకున్నారు. ఆయన ఆంధ్రప్రాంతం వాడే! ఆయన కారణంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందనేది సత్యం. కత్తులు నూరుకోకండి! కుత్తుకలు కత్తరించుకోకండి!

నిజాము కోరల్లో నలిగిపోతున్న తెలుగువారిని తమతో చేర్చుకోమని బూర్గుల రామకృష్ణారావు, వల్లూరి బసవరాజు వంటి నాయకులు కోరింది సత్యము కాదా! వారిమంచితనం ఈనాడు మట్టిలో కలిసిపోయింది.

ఆనాడు ఆంధ్రులకు నిజాములో భద్రతలేదనీ, వారూ వీరూ కలిసి ఉంటే బలిమి ఉంటుందని ఆ పెద్దలు ఆలోచించి చేసిన కలయిక వీరెరుగరా? ఇపుడల జడులు లేవనెత్తిన వారెవరైనా ఆనాడు దేశం కోసంగానీ, రాష్ట్రంకోసం గానీ ప్రజల కోసంగాని త్యాగాలు చేసారా? పాటుపడ్డారా! భోగాలు భాగ్యాలు సంపాదించారు. భారతీయుల్లోనీ, తెలుగు (ఆంధ్ర)వారి రక్తాల్లో గుండాయిజం లేనేలేదు. తెలుగుతల్లి పాలుతాగి, పెరుగుతూ చిట్టిపాదాలతో తన పొట్టను తన్నుతూ, చనుమొనలను గిల్లుతున్ననూ తల్లికన్నమిన్నగా మాతృవాత్సల్యంతో చంకను వేసుకుని అడుగుల్ని నేర్పి, అక్షఅజ్ఞాన ప్రసాదం చేసి, పాడిపంట సంపదలొసగి సాకిన 'తెలుగుతల్లి' వీరికి తల్లికాదా?

తమతో కలుపుకున్న తమజాతివారిపై దురుసుమాటలాడి, ధూర్తలక్షణంతో కత్తులు దూయడం ఏంవి సబబు! శ్రీలు పండే సీమలో గరికను కూడా పెరగనీయకుండా, తమ సంతతిని విభజన విషంతో పెంచుతూ, మొక్కగాకుండా, మొలకగా నున్నపుడే త్రుంచుతున్న వారొక్కసారి మనసుపెట్టి ఆలోచించాలి. వాళ్ళ బిడ్డల్ని (విద్యార్థుల్ని) వారే ఉద్యమాల్లో ఆహుతి చేస్తున్నారు కానీ పెద్దలు రంగంలో పాలొనడంలేదు. ఇపుడీ దౌర్జన్యానికి దాసోహమవుతున్న వీరు దుర్యోధన, దుశ్శాసన క్రౌరత్వపు కౌరవులవుతున్నారు, శిశుహంతకులవుతూన్నారు. సస్యశ్యామలమైన వ్యవసాయభూమిని రక్షణగా ఉన్న కొండల్నీ పిండిచేస్తున్నారు.

ఏడుకొండలవాడా! నీవు వెలసిన ఏడోకొండను కూడా అంతస్థుల భవనాలతో గాలి చొరబడకుండా, నిన్ను నిదురపోనీకుండా చేస్తున్నారని తెలుసుకో!.

**కంసాంతకం శంసనీయం సంశాంతం సంస్కృతిచ్ఛిదం**
**సంశయచ్ఛేది సంవిత్యం శ్రీనివాసం భజే నిశమ్!**


కంసుని వధించినవాడవు, బ్రహ్మాది దేవతలచే స్తుతింపబడుతూన్నవాడవు, శాంతి సౌఖ్యాలను ప్రసాదించువాడవు. భక్తుల సంశయాలను, భయాలను పోగొట్టి జ్ఞానమోక్షములు ప్రసాదించువాడవు. రామకృష్ణ స్వరూపుడవగు శ్రీనివాస ప్రభూ! అఖిలాంధ్రములో జరుగుతూన్న విధ్వంసకాండకు కారణభూతు లైనవారిని సన్మార్గంలోకి పరిక్రమించేట్టు కరుణించు! కరుణాభరణా! వేంకటరమణా! లేకున్నచో వారి స్వార్థం నీ కొండలను కూడా పిండిచేసే ప్రమాదమున్నది.

**స్తోత్రేణానేన సంతుష్టో వేంకటేశో రమాపతిః**
**యాన్‌యాన్ కామాన్ కామయంతే తాంస్తాన్**
**ముక్తిందదాతిచ!**

ఇలా స్తోత్రించిన మమ్ము, లక్ష్మీనాధుడవైన వేంకటేశా! సంతోషించి మేము ఏమేమి కోరుదుమో వాటిని అనుగ్రహిస్తూ, దేశ శాన్తినీ, సుఖైక్యమత్యాన్ని ప్రసాదించ గలవని విశ్వసిస్తున్నాం తండ్రీ! **అన్యదా శరణం నాస్తి త్వమేవ శరణం మమ!**

**శ్రీ వేంకటేశ కటాక్ష ఫల సిద్ధిరస్తు**

బుధజన విధేయుడు
– *గోటేటి శ్రీరామారావు*



※ **స్తుతిపూర్వకమైన ఈ సంపాదకీయం చదివినవారికి వేంకటరమణుడు సకల శుభముల నొసగుట తథ్యమ్!**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# రాచరికపు ఠీవికి నిలయం... రాష్ట్రపతి భవనం!

## రాష్ట్రపతి దేశాధినేత, ఆయన భవనం సార్వభౌమ భవనంలో ఉంటుంది.

మన రాష్ట్రపతి భవనానికి ప్రపంచ ప్రఖ్యాతి ఉంది. ప్రపంచ దేశాధినేతలందరి భవనాల్లోకి మన రాష్ట్రపతి భవనం అతి పెద్దది. ఇది నిర్మాణమై ఇప్పటికి 83 ఏళ్లయ్యింది. 29,000 మంది కార్మికులు 17 ఏళ్లపాటు నిర్మించిన భవనంలో 340 గదులు ఉన్నాయి. మొత్తం 275 ఎకరాల స్థలంలో 2,00,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో సార్వభౌమ రాచఠీవి ఉట్టిపడే ఈ భవనం ఒకప్పుడు మన దేశాన్ని పాలించిన బ్రిటిష్‌వారి ప్రతినిధి అయిన గవర్నర్ జనరల్ భవనమే!

1911కి ముందు దేశరాజధాని కలకత్తాలో ఉండేది. దాన్ని ఢిల్లీకి మార్చాలన్న ఉద్దేశంతో ఈ భవనాన్ని నిర్మించి 'వైస్‌రాయ్ హౌస్' అని పేరుపెట్టారు. స్వాతంత్ర్యం వచ్చాక 1950లో దీనికి 'రాష్ట్రపతి భవన్' అని పేరు మార్చారు. ఈ భవనంలలో మొఘల్ గార్డెన్ ప్రత్యేక ఆకర్షణ. 13 ఎకరాల స్థలంలో ఉన్న దీంట్లో 418 మంది తోటమాలులు పనిచేస్తారు. ఈ తోటలో తామరపువ్వు ఆకారంలో ఉన్న 6 ఫౌంటేన్లు ఆకర్షిస్తాయి. 250 జాతుల గులాబీ మొక్కలను ఇక్కడ చూడవచ్చు. కొన్ని అరుదైన గులాబులకు మదర్ థెరిసా, నెహ్రూ, రాజారామ్మోహన్‌రాయ్ లాంటి నేతల పేర్లను పెట్టారు. వేలాది సీతాకోక చిలుకలు తిరుగాడే 'బట్టర్ ఫ్లై గార్డెన్' కూడా ఉంది.

- రాష్ట్రపతి భవన్ నిర్మాణానికి కోటి రూపాయలకు పైగా ఖర్చయ్యింది. ఇప్పుడున్న విలువ ప్రకారం చూస్తే ఈ భవనం స్థలమే ఏకంగా 16,000 కోట్ల రూపాయలు పైవిలువ ఉంటుందని అంచనా.
- భవనంలో 37 ఫౌంటేన్లు ఉన్నాయి.
- అధికారిక కార్యక్రమాలు నిర్వహించే దర్బార్ హాల్‌లో రెండు టన్నుల బరువైన దీపతోరణం (షాండ్లియర్) ఉంది.
- భవనంలో వంట పాత్రల మ్యూజియం ఉంది.
- అబ్దుల్ కలాం హయాంలో రోజూ రెండు పాఠశాలలకు చెందిన పిల్లల్ని రాష్ట్రపతి భవనానికి ఆహ్వానించేవారు.
- రాష్ట్రపతులకు వచ్చిన కానుకలు భద్రపరచడానికి 'తోషా ఖానా' అనే కోశాగారం ఉంది.
- ఇన్నాళ్ళూ రాష్ట్రపతిగా ఉన్న ప్రతిభా పాటిల్‌కు సుమారు 2500 కానుకలు వచ్చాయి.
- కొన్నిటిని మహారాష్ట్రలోని ఓ మ్యూజియం వారికి ఇచ్చేశారు.
- భవనం ఆవరణలో 9 టెన్నిస్ కోర్టులు, పోలో గ్రౌండ్, గల్ఫ్‌కోర్స్, క్రికెట్ మైదానాలు ఉన్నాయి.
- భవన నిర్మాణంలో 70 కోట్ల ఇటుకల్ని 35 లక్షల క్యూబిక్ అడుగుల రాతిని వాడారు.
- అసలు స్టీలును వాడని భవనం ఇదే!!

భారతదేశం బాధ్యతాయుత పార్లమెంటరీ ప్రజాస్వామిక ప్రభుత్వ వ్యవస్థగల దేశం. బాధ్యతాయుత పార్లమెంటరీ ప్రభుత్వం గల రాజ్యాలకు రెండు రకాల అధిపతులు ఉంటారు. ఒకరు నామమాత్రపు అధికారి, రెండవ వారు వాస్తవ అధిపతి. భారతదేశానికి రాజ్యాంగ రీత్యా అధిపతి రాష్ట్రపతి. ప్రభుత్వాధికార మంతా రాష్ట్రపతి పేరున నడుస్తుంది. రాజ్యాంగం రాష్ట్రపతికి అనేక అధికారాలు ప్రసాదించినా వాటి నన్నిటిని రాష్ట్రపతి, మంత్రి మండలి సలహాపై చెలాయించాలి. కాబట్టి పాలనాధికార మంతా మంత్రి మండలి ఆధీనంలో ఉంటుంది. ఈ కారణంగా రాష్ట్రపతిని నామమాత్ర అధిపతిగా, మంత్రి మండలి వాస్తవ అధిపతిగా పేర్కొనాలి.

రాష్ట్రపతిని ఎలక్టోరల్ కాలేజీ ఎన్నుకుంటుంది. ఈ కాలేజీలో పార్లమెంటు ఉభయ సభలలో ఎన్నిక ద్వారా సభ్యులైనవారు, రాష్ట్ర శాసనసభల్లో ఎన్నిక ద్వారా సభ్యులైనవారు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రపతి ఎన్నికల్లో పార్లమెంటు సభ్యులతోపాటు రాష్ట్ర శాసనసభల సభ్యులు కూడా పాల్గొనటం వల్ల సమాఖ్య రాజ్యమైన భారతదేశంలో కేంద్ర ప్రభుత్వాలకీ, రాష్ట్ర ప్రభుత్వాలకీ సమాన ప్రాతినిధ్యం ఉన్నది.

రాష్ట్రపతి పదవీ కాలం అయిదు సంవత్సరాలు. ఒకే వ్యక్తి రాష్ట్రపతి పదవికి ఎన్ని సార్లయిన ఎన్నిక కావచ్చు. పూర్వం ఉప రాష్ట్రపతులనే రాష్ట్రపతిగా ఎన్నుకొనే సాంప్రదాయం ఉండేది. రెండు పర్యాయములు రాష్ట్రపతి పదవి నిర్వహించిన వారున్నారు. రాష్ట్రపతి అధికారాలు రెండు రకాలు. ఒకటి సాధారణ అధికారాలు, రెండు అసాధారణ అధికారాలు. సాధారణ అధికారాలు శాసననిర్మాణం, కార్యనిర్వహణ, ఆర్థిక వ్యవహారాలు, న్యాయపాలనకు సంబంధించినవి. అసాధారణ పరిస్థితులలో రాష్ట్రపతికి ఉండే అధికారాలను అసాధారణ అధికారాలు అంటారు. అసాధారణ పరిస్థితులు మూడు రకాలు. 1) విదేశీయుల దండయాత్ర, యుద్ధం, దేశంలో సాయుధ తిరుగుబాటు మూలంగా దేశభద్రతకు శాంతికి భంగం కలగడం. 2) రాజ్యాంగ బద్ధంగా ఒక రాష్ట్రంలో ప్రభుత్వ పాలన సాగకపోవడం. 3) దేశం మొత్తంలో లేదా ఒక భాగంలో ఆర్థిక సౌష్టవానికి భంగం కలుగడం. ఈ మూడు పరి స్థితులను ఎదుర్కోటానికి రాష్ట్రపతికి విశిష్టమైన అధికారాలున్నాయి. ఇవే అసాధారణ అధి కారాలు.




దేశ రాజకీయ వ్యవస్థలో రాష్ట్రపతి పాత్రపై రాజ్యాంగం అమలులోకి వచ్చిన దగ్గరనుండి తర్జన భర్జనలు జరుగుతూనే ఉన్నాయి. రాజ్యాంగం అమలు కాక పూర్వం రాజ్యంగ నిర్మాణ సమయంలో రాజ్యాంగ సభ సభ్యులం దరూ ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. స్థూలంగా అందరూ అంగీకరించింది, రాష్ట్రపతి నామ మాత్రపు దేశాధినేత, అని నిజమైన అధికారి ప్రధాన మంత్రి నేతృత్వంలోని మంత్రి మండలి అని. రాజ్యాంగం ఎలా ఉన్నా మంత్రివర్గంతో, ప్రధానమంత్రితో ఉండే సంబంధాలను బట్టి, రాష్ట్రపతి అంతస్థు, అధికారాలు ఆధారపడి ఉంటాయి. అంతేకాక కేంద్రంలో, రాష్ట్రాలలోని అధికార పార్టీల పనితీరును బట్టి ఉంటాయి. ప్రస్తుత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ బెంగాల్ రాష్ట్ర పౌరుడు. ఇంతవరకూ బెంగాల్నుంచి రాష్ట్ర పతిగా ఎన్నికైనవారు లేరు. సౌమ్యుడు, ఆధ్యాత్మిక తత్పరుడు అయినప్పటికినీ చాణుక్యుడు. రాజీవ్ నుంచి సోనియా వరకు సత్సలహాదారుడు. ●

# జిల్లెళ్ళమూడి నాన్నగారు శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావు బ్రహ్మాండ మహోదయుని అక్టోబర్ 26న శతసంవత్సర బ్రహ్మాండ వైభవం

– డా॥పొత్తూరి వెంకటేశ్వరరావు, హైదరాబాద్



'అమ్మ' అనుగ్రహం!

నాన్నగారు అని మనం గౌరవంతో పిలిచుకున్న బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు చాలా గొప్ప వ్యక్తి. అమ్మకు పతిదేవుడు కావడం వల్ల ఆయనను నాన్నగారు అని పిలుచుకొన్నాము. అమ్మను "అమ్మా!" పిలుస్తాము. కాని నాగేశ్వరరావుగారిని నాన్నగారూ అంటాము. అమ్మను అమ్మా అని పిలవటంలో చనువు ఉంది. సాన్నిహిత్యం ఉంది. "నాన్నగారు!" అని పిలవటంలో గౌరవం ఉంది. ఒకింత దూరం కూడా ఉంది. మనతో మాట్లాడేటప్పుడు అమ్మ ఎప్పుడూ "మీ నాన్నగారూ" అనే అంటుండేవారు. నాగేశ్వరరావు గారు "మీ అమ్మగారు" అంటూండేవారు. "గారు" శబ్దం లేకుండా అమ్మను గురించి ఆయన మాట్లాడిన సందర్భం నాకు తెలిసినంతలో లేదు. ఆయన గొప్ప వ్యక్తి. గొప్పతనం ఆయన జిల్లెళ్లమూడి గ్రామానికి కరణం అయినందువల్ల వచ్చినది కాదు. అమ్మకు భర్త అయినందువల్ల ఆయనను గురించి మనందరం తెలుసుకొనే అవకాశం కలిగింది. అందువల్లనే ఆయన గొప్పవారు కాలేదు. వ్యక్తిగా ఆయన గొప్పతనానికి కారణాలు ఉన్నాయి.

నాన్నగారు నాకు తనతో మాట్లాడే అవకాశాలు చాలా కల్పించారు. నేను జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడల్లా ఆయన గ్రామంలో ఉంటే మేమిద్దరం తప్పనిసరిగా ఎంతో కొంతసేపు మాట్లాడుకొనేవాళ్ళము. ఆయన తనతో కలిసి భోజనం చేసే అవకాశాలను కూడా చాలాసార్లు కల్పించారు. అది ఆయన ఔదార్యం. నా అదృష్టం. అమ్మను చూడటానికి వచ్చిన చాలామందితో ఆయన మాట్లాడేవారు. అలాగే నాతోను మాట్లాడారు. కాని, నాకు బహుశః ఇతరులకంటే ఎక్కువ అవకాశాలు ఉండవచ్చు. మేము ఎక్కువ సేపు మాట్లాడి ఉండవచ్చును.

నాన్నగారు రాజకీయాలలో పాల్గొనకపోయినప్పటికీ అపారమైన రాజకీయ పరిజ్ఞానం కలిగినవారు. ఆయనకు దగ్గర స్నేహితులలో ఒకరు కోన ప్రభాకరరావు గారు, మంత్రిగా, స్పీకరుగా, గవర్నరుగా పనిచేసిన ప్రముఖ నాయకుడాయన.





'నాన్న' గారి ఆదరం



'అరే, ఒరే' అనుకునే స్నేహబంధం వారిది. నాన్నగారు కాంగ్రెస్ పార్టీ అభిమాని. కాని ఎప్పుడూ సభ్యులు కారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచీ కాంగ్రెస్ చరిత్ర తెలిసిన వారు. తన అభిమానాన్ని ఆయన దాచుకోరు. నేను పత్రికలలో పనిచేస్తున్నవాడను గనుక నాతో ఆయన ప్రధానంగా రాష్ట్ర పరిస్థితులను గురించి, ముఖ్యంగా రాజకీయపరిణామాలను గురించి మాట్లాడేవారు. జర్నలిస్టుగా నాకు ఒక పార్టీపట్ల ప్రత్యేకమైన అభిమానంగాని, మరొకపార్టీ పట్ల వ్యతిరేకతగానీ లేదు. అది నా విధానం. నాయకుల విషయంలోనూ నా వైఖరి అదే. అభిప్రాయాలు ఉంటాయి. కాని, అవి పార్టీలతోనూ, నాయకులతోనూ నా సంబంధాలను ప్రభావితం చేయవు. నాన్నగారికి కాంగ్రెస్ పార్టీ పట్ల ఉన్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని సరదాగా నేను ఆ పార్టీని ఆక్షేపిస్తూ మాట్లాడేవాడిని. ఆయనకు బాధకలిగేది. అది కొద్దిపాటి కోపంగా కూడా మారేది. ఆవేశంతో కాంగ్రెస్ పార్టీని సమర్థిస్తూ మాట్లాడేవారు. కోనా ప్రభాకరరావుగారు నాకు గూడా తెలుసు. మాకు దూరపు బంధుత్వం కూడా ఉంది. అయినా, నాన్నగారిని కాస్త కవ్వించడానికి "ఆయన బాపట్లకో, గుంటూరు జిల్లాకో, రాష్ట్రానికో ఏమి చేశాడండీ! ఒక్క మంచి పనిలేదు ఘనంగా చెప్పడానికి" అంటే ఆయన రెచ్చిపోయి ప్రభాకరరావు ఎన్నెన్ని మంచి పనులు చేశారో అంటూ వెంటనే ఏకరువు పెట్టేవారు.

నాన్నగారి గొప్పతనం ఆయన మాలాంటి వారెందరో అమ్మ దగ్గర చనువుగా మెలిగే అవకాశాన్ని కలిగించటం. చిన్న పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వాళ్ళూ అమ్మ ఒడిలో వాలిపోయేవారు.

అమ్మ తీవ్రమైన అనారోగ్యంతో హైదరాబాదు వచ్చి, 1980లో కొన్ని రోజులు రాజగోపాలాచారి గారి ఇంట్లో ఉన్నారు. అప్పుడు నాన్నగారు కూడా వెంట వచ్చారు. అమ్మ రాత్రింబవళ్లు చాలా బాధపడుతుండేది. నాన్నగారు చాలా దిగులుపడ్డారు. ఆందోళన ఆయన ముఖంలో స్పష్టంగా కనిపిస్తుండేది. అమ్మ బాధను చూడలేక, అమ్మను చూడకుండా ఉండనూ లేక ఆయన పడిన అవస్థను నేను చూశాను.

నాన్నగారిని గురించి సమగ్రంగా చెప్పగలిగిన శక్తి అమ్మకే ఉన్నది. అమ్మకు తెలిసిన చాలా విషయాలు మనలో ఎవరికీ తెలిసే అవకాశం లేదు. నాన్నగారిని గురించే కాదు. ఎవరి గురించైనా అందరికీ అన్ని విషయాలు తెలియవు. అత్యంత ప్రసిద్ధులైన వారి విషయంలో వారి జీవిత విశేషాలను గురించి పరిశోధనలు జరుగుతాయి. జీవిత చరిత్రలు వెలువడుతాయి. వారందరూ గొప్పవాళ్ళే. గొప్పతనం వేరు. కీర్తివేరు. కీర్తి, గొప్పతనం కలిసి కొందరిని ప్రసిద్ధులను కావిస్తాయి. ప్రసిద్ధులు కాకపోయినా, గొప్పవాళ్లయిన వారు కొందరు ఉంటారు. నాన్నగారు అందులో ఒకరు. నాకు వలెనే ఎంతో కొంత తెలిసిన సోదరీ సోదరులు ఇంకా కొందరున్నారు. వాళ్ల పరిస్థితీ ఇంతే. నాన్నగారు చాలా గొప్ప వ్యక్తి అనడానికి ఆయన దయవల్లనే అమ్మ దగ్గరకు మనందరం వెళ్లి, చనువుగా ఉండగలిగామన్న ఒక్క కారణం చాలు. నాన్నగారి శతజయంతి సందర్భంగా ఆయన స్మృతికి శతసహస్ర వందనాలు. ●

## చరిత్రకు రాని సాహసమహిళ, జాతీయాభిమాని

# కంభంపాటి మాణిక్యాంబ



వీరు 1917లో తూర్పుగోదావరి జిల్లా అమలాపురం తాలూకాలోని తొండవరం గ్రామంలో వెంపరాల సుబ్రహ్మణ్యశాస్త్రి, సుభద్రమ్మ దంపతుల పుత్రికారత్నంగా మాణిక్యాంబ జన్మించారు. 5వ తరగతి వరకే చదవడం, ఆ వెంటనే కంభంపాటి సత్య నారాయణగారితో వివాహం జరగడం చకచకా జరిగిపోయినవి. భర్త మాణిక్యాంబను చదివేటట్లు ప్రోత్సహించారు. రచయిత్రిగా ఆంధ్రుల చరిత్ర, భారతదేశ చరిత్ర, అబలా సచ్చరిత్ర రత్నమాల, రాణి అహల్యాబాయి, విజయనగర సామ్రాజ్యం వంటి గ్రంథాలను ఆమె లేత హృదయంకల వయస్సులోనే రచించారు. ఆమెలో ఆ సాహిత్యం దేశాభిమానాన్ని, జాతిపట్ల గౌరవాన్ని అపారంగా పెంచాయి.

మాణిక్యాంబ భర్త సత్యనారాయణ చెన్నైలో ఎం.ఎ. విద్యాభ్యాసం గావించారు. గాంధీజి పూరించిన స్వాతంత్ర్య, శంఖారావాన్ని విని 1930లో ద్వితీయ సంవత్సరం ఎంఏ ముగించకుండానే సమరరంగంలోకి ప్రవేశించారు. జైలుకు కూడా వెళ్ళారు. మాణిక్యాంబకూ దేశ సేవచేయాలనే సంకల్పం ఆమె 14వ ఏటనే కలిగింది. ధర్నా చేస్తూ సత్యాగ్రహోద్యమంలో ప్రవేశించారు. ఏలూరులోని విదేశీ వస్త్ర దుకాణాల వద్ద స్వదేశీ దుస్తులను ధరించమని ధర్నా చేశారు. ఏదో చిన్నపిల్లలని కొద్దికాలం అధికారులు పట్టించుకోలేదు. చివరకు విసిగి అరెస్టు చేసి ఏలూరు సబ్‌జైలులో పక్షం రోజులు ఉంచి అటుపైన విడుదల చేశారు. ఈ సంఘటనలకు మాణిక్యాంబ ఏనాడు భయపడలేదు.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కాంగ్రెసు నాయకులతో సేవాదళ శిబిరం స్థాపించారు. ఆ శిబిరంలో వీరు ఒకవైపు శిక్షణ పొందుతూ, వేరొకవైపు పికెటింగులు చేసారు. పశ్చిమ గోదావరి జిల్లాలో శాసనధిక్కారం చేసిన నేరానికి మాణిక్యాంబతోపాటు ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, కాశీపట్నపు కొండయ్య, తల్లాప్రగడ ప్రకాశరాయుడు ప్రభృతులను అరెస్టు చేశారు. ఇలా ఆమె అరెస్టు కావడం రెండవసారి. ఆమెను కొవ్వూరు సబ్‌జైలులో 15 రోజులు ఉంచి, తిరిగి విడుదల చేశారు. 1932లో ప్రతిజిల్లా, తాలూకాల్లో రాజకీయ మహాసభలు జరిగాయి. ఆ సభలకు అధ్యక్షత వహించిన వారినెందరినో అరెస్టుచేసి జైళ్ళకు పంపారు. అటువంటి సందర్భాలలో వేరొకరు అధ్యక్షత వహించేవారు. ఆ తరుణంలో 16 ఏళ్ళ ప్రాయమైనాలేని వీరు తెనాలి తాలూకా కూచిపూడి గ్రామంలో జరిగిన రాజకీయ మహాసభకు అధ్యక్షత వహించారు. 23 ఆగష్టు 1932లో ఆమెను అరెస్టు చేసి ఆరుమాసాల పాటు విడి ఖైదు చేసి, రాయవెల్లూరు జైలుకు పంపారు. జైల్లో మిసెస్ ప్రభ, మిసెస్ కజిన్సు, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, కుట్టిమాలు అమ్మ, ఆదుర్తి లక్ష్మీబాయమ్మ ప్రభృతులను ఆమె కలుసుకున్నారు.

1937లో అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రశాసనసభకు ఎన్నికలు జరిగినవి. కాంగ్రెస్ తరఫున కాకినాడలో బులుసు సాంబమూర్తి, మల్లిపూడి పళ్ళంరాజు అభ్యర్థులుగా నిలిచారు. మాణిక్యాంబ దంపతులు కాకినాడలో బసచేసి కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం తీవ్రంగా చేశారు. ఆ తరువాత కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, ఆ మీదట కమ్యూనిస్టు పార్టీ ఈ దంపతులను విశేషంగా ఆకర్షించాయి. ఏ పార్టీలో ఉన్నా తాము నమ్మిన సిద్ధాంతాలను మనస్ఫూర్తిగా ప్రచారం చేయడం, ప్రజల్లో చైతన్యం కలిగించడమే ఆ దంపతుల లక్ష్యమైంది. ఆంధ్రరాష్ట్ర శాసనసభలో అయ్యదేవర కాళేశ్వరరావు, బహుభార్యా నిషేధ చట్టాన్ని ప్రవేశపెట్టారు. కుల, మత, వర్ణవర్గ, జాతిబేధం లేకుండా స్త్రీ సుఖ సంతోషాలకు, భద్రతకైనా ఈ చట్టం అతిముఖ్యమైనది. అందువల్ల మాణిక్యాంబ స్త్రీలలో ఈ విషయాన్ని తిరిగి ప్రచారం చేసారు. రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన వరదక్షిణ నిషేధచట్టం, మద్రాసు రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన దేవదాసీ విధాన నిర్మూలనా చట్టం సందర్భాల్లో కూడా మాణిక్యాంబ స్త్రీల హృదయాలను హత్తుకునే విధంగా వాటి ఆవశ్యకతను ప్రచారం చేశారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఫాసిస్టు రాజ్యాల దురాక్రమణ భయంకర రూపుదాల్చింది. విమానదాడులు జరిగినట్లయితే పాటించవలసిన విధులను, రక్షణ మార్గాలను వనితాలోకానికి ఆసక్తిగా బోధించారు. ఆమె ఏనాడు ఏ పదవులూ ఆశించలేదు. పదవులురాలేదని బాధపడలేదు. జాతీయాభిమానంతో, సేవాతత్పరతతో కార్యరంగంలో ప్రవేశించి నిస్వార్థంగా చేసిన సేవను ప్రజలు మాత్రమే గుర్తించారు. ప్రభుత్వం గుర్తించినట్టు లేదు. దేశం ఎన్నటికీ మరువని త్యాగశీలి, పదవీకాంక్షలేని గుణశీలి. ●

## శ్రీ పదార్చన

- యస్. కుళసుందరం, తిరుపతి

అలిమేలు మగడా! ఆర్తరక్షకుడా!
అలసిపోయావేమో కునుకేయి స్వామీ!
ఎన్ని యుగాదులో చెప్పలేనుర స్వామీ
నిలబడే వున్నావు నీకెంత ఓర్పుర స్వామి
అరఘడియ విశ్రాంతి కరువాయెనా దేవ
కరుణించి కునుకేయి కమలాక్షుడా! ॥అలిమేలు॥

చెమట చుక్కల మోము మంచు కడిగిన ముత్యం
కరుణకాంతులతోడ దీపించు నీ రూపం
తాపమే తెలియని కోపమేరాని ఓర్మి నీ సొంతం
చూచినంతనె చాలు పొందు సుఖములు జనం! ॥అలిమేలు॥

మొగిలి వాసనలు నింపె గదినింద భూదేవి
సన్నజాజుల సెగలు కర్పూర గంధాలు నింపె శ్రీదేవి
వలపుగుండెలు పరచి రమ్మనీ పిలిచేరు
నా స్వామి నిదురించు దేవేరులుతో చేరి! ॥అలిమేలు॥

అధరాల చంద్రికలు కలువరేకులు కలిసి
రేయెండలో ఇంద్రధనువులే మెరయ
ముద్దు సతులిద్దరితొ మురిసి నిదురించరా
తిరుమలవాసుడా! జగమేలు దేవుడా! ॥అలిమేలు॥



# హైదరాబాద్‌లో ప్రథమ పౌరుడికి ద్వితీయ భవనం ఉన్నది

ఎంతమందికి తెలుసో యేమో, భారతరాష్ట్రపతి దక్షిణాదికి వచ్చినపుడు హైదరాబాద్‌లో విడిది చేయడానికి ఓ చక్కని భవనం ఉన్నది. హైదరాబాద్ సంస్థానమును భారత దేశ సర్వస్వతంత్ర సార్వభౌమాధికారంగల భరతఖండంలో చేర్చినపుడు కేంద్రానికి కలిగిన ఓ సముచిత ఆలోచన హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయం. ప్రతీవత్సరమూ రాష్ట్రపతి సపరివారంగా వచ్చి ఇక్కడ విడిది చేస్తారు. ఇందువలన చుట్టుప్రక్కల గల పెద్దలు రాష్ట్రపతిని కలిసే అవకాశం, ఇక్కడి సంస్కృతీ పాటవాలు తెలుసుకునే అవకాశం, అవగాహనం ఉంటుంది. పూర్వం రాజులు కూడా విశాల సామ్రాజ్యంలో ఇలాంటి విడిదిగృహాలను ఏర్పాటు చేసుకుని, మందీ మార్బలం, వంటావార్పు గాళ్ళతో రావడం, ఆయా రోజుల్లో అక్కడి పెద్దలతో గోష్ఠులు జరపడమే గాకుండా, ఆయాప్రాంత సాంస్కృతిక కార్యక్రమాలను చూసేవారు. ఇది ఒంటి అంతస్థు భవనం. చుట్టుప్రక్కల చక్కని ఫల, పూలగుత్తుల వనం ఉన్నది. మొత్తం ఆ భవనం 92-96 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. మొదటిగేటు మీద నాలుగు సింహాలు భారత్ అశోక్‌స్తంభం చిహ్నంగా ఉంటుంది. మెయిన్‌కారిడాలర్లో రెండు గోడలకూ మాజీ రాష్ట్రపతుల ఫోటోలు తగిలించబడి ఉన్నాయ్. బాబూ రాజేంద్రప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణ, ఆర్. వెంకట్రామన్, వి.వి.గిరి, నీలం సంజీవరెడ్డి, శంకర్‌దయాళ్‌శర్మ, కె.ఆర్. నారాయణ, అబ్దుల్ కలామ్, మొన్నటి ప్రతిభాపాటిల్ వరకూ గల ఫోటోలున్నాయ్.

మాప్ గీసినట్లు సీతాఫలం, జామఫలం, కొబ్బరితోటలు, పూల, ఫల తోటలెక్కడ ఉన్నవీ ఓ ఫలకంపై గీచిపెట్టారు. రాష్ట్రపతి వి.ఐ.పి.లను కలిసే గదిలో చాండ్లియర్ లైటు ఉంది. గోడలకు పెయింటింగ్స్, ఒక గోడకు గౌతమ బుద్ధుని నఖచిత్రాలు, పెద్ద గడియారం, చతురస్రాకారపు సోఫా ఉంటుంది. డైనింగ్ హాల్లో దీర్ఘచతురస్రాకారపు టేబుల్, ఏకకాలంలో 32 మందికి భోజనం చేయడానికి బల్ల, కుర్చీలున్నాయ్. దర్బారుహాలు, సినిమాహాలు, రాష్ట్రపతి పడుకునే స్థాయికి తగ్గట్టుండే పడకగది, ఆయన విశ్రాంతికి మరొక గది. మిలట్రీ సెక్రటరీ గది, ఎక్కడికక్కడికి సి.సి. కెమెరాలు, వంటగది నుంచీ భోజనగదికి సొరంగమార్గం, ఫ్రూట్‌గార్డెన్, గులాబీగార్డెన్ 120 కోట్ల జనాభా ఉన్న భారతపౌరుల గల దేశంలో అత్యున్నత ప్రథమ పౌరాధిపతి గౌరవానికి తగ్గట్టుగా ఎంతో ఉన్నతంగా ఈ భవనం ఉంటుంది సాంప్రదాయి నీటి పారుదల జలపాత నాదంలా ఉంటుంది. దేవగన్నేరుపూలు, అశ్వగంథ, అనంతపద్మలక్ష్మీ చెట్లువంటి ఔషధ వనాలున్నాయ్.

**భవన చరిత్ర:** 1860 సం॥ములో నిజాం నాజిర్ ఉద్‌దౌలా దీనిని నిర్మించారు. అప్పుడాయన ప్రధాని సర్ సాలార్‌జంగ్ మిలటరీ కంటోన్మెంట్ ప్రధాన సైనికాధికారి. ఇందులో బసచేసేవారు. ఈ రాష్ట్రము భారతదేశంలో విలీనమైన తరువాత భారత ప్రభుత్వం భారత రాష్ట్రపతి దక్షిణాదిన బసచేసే రాష్ట్రపతి నిలయంగా మలిచారు. నిటాలుగా వ్యాపించిన భారతదేశానికీ నిలయం రెండవ రాజధానియైనా కావచ్చుననే ఏర్పాటుతో చేసినట్టుంది. ఆకారము ఒక చిట్టడివిని క్రమబద్ధీకరించి యిలా చేపట్టినట్టు సహజ సౌందర్యకోటగా ఉంటుంది.

Compliments from
**Sri Krishna Bhat**
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

## ఆశ్శీశతములు

దివ్యాత్మ స్వరూపులు శ్రీమాన్ గోటేటి శ్రీరామారావుగారు, హరిఓం మంగళాశాసనములు. శ్రీకృష్ణ జయంతి శుభాకాంక్షలు.

బీహార్ స్కూల్ ఆఫ్ యోగా- రిఖియాపీఠాధీశ్వరి మద్రాసు ఆగమన సందర్భం (2011)లో మనం కలిశాము. అప్పటి నుండి ప్రేమతో టివిఎస్‌పై విజయవాడ ఆశ్రమానికి మీరు 'ప్రముఖాంధ్ర' సంచికను పంపుతున్నందుకు కృతజ్ఞతలు. 'ఆంధ్రభాష, ఆంధ్రజాతికి పత్రిక ద్వారా మీరు చేస్తున్న సేవ శ్లాఘనీయం.


సన్యాసి అందరివాడైనా- ఈ శరీరంలో తెలుగు రక్తం ప్రవహిస్తుండటంతో- తెలుగుజాతికి మీ అకుంఠిత అభిమానాన్ని సేవలను మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాము. ఆయుష్మాన్ భవ. విజయీభవ!

2013 ఆగస్టు సంచిక ప్రత్యేకతగా మాకు అనిపిస్తున్నది. మిక్కిలి, 4వ పేజీలోని జాతి నాయకుల గురించి 6వ పేజీలోని 'చందమామ' జనన- పురోగతి- 21వ పేజీలో రాయప్రోలు సుబ్బారావుగారు, 28వ పేజీ శ్రీరామారావు గారు 24వ పేజీలోని అల్లూరి సీతారామరాజు- జీవిత, సేవా వివరాలు క్లుప్తంగా - విశదంగా, పఠనీయ ఉత్కంఠతో సాగాయి. మీకు అభినందనలు-ఆశీర్వచనములు. ప్రముఖాంధ్ర 'శాశ్వత నిధి'కి మీరు చేసిన వినతి ఎందరినో ఉత్సాహపరచి- విరాళవర్షం కురవాలని పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాము. శాంతి, ఆయురారోగ్య సౌభాగ్యాలతో మరింత విస్తృతంగా ఆంధ్రావనికి సేవలు చేసే మహద్భాగ్యం చేకూరాలని శ్రీయఃపతికి వేడుకోలు. -ప్రేమానురాగాలతో ఓం తత్సత్

స్వామి భక్తి చైతన్యానంద సరస్వతి

# అర్థనారీశ్వరం... అంతరార్థం

## 'అమ్మ' శక్తే సృష్టికీ, లోకరక్షణకూ కారణం!



సృష్ట్యాదిలో నారాయణుడొక్కడే ఉన్నాడు. నారాయణుని నాభి కమలం నుంచి అవతరించిన చతుర్ముఖ బ్రహ్మ పరమాత్మ ఆదేశానుసారం సృష్టి కార్యానికి పూనుకొని, మహాత్ముల సహకారం అర్థించాడు. ముందు స్త్రీ జాతిని సృష్టించు, నీ కార్యం సఫలం అవుతుంది ఆకాశవాణి అన్న వాక్కు విని, బ్రహ్మ ఆశక్తి తనకు కలగాలని చాలా కాలం తపస్సు చేయడం ప్రారంభించాడు.

పరమేశ్వరుడు కరుణించి అర్ధనారీశ్వరుని రూపంలో ప్రత్యక్షమయ్యాడు. బ్రహ్మ మనోగతం తెలుసుకుని, తనశరీరంలోని అర్ధభాగంగా అమరి ఉన్న పార్వతీదేవిని పరాశక్తిగా వేరుచేసి, బ్రహ్మ సృష్టికి సహకరించమన్నాడు. ఆమె 'అలాగే చేస్తాను' అని తన కనుబొమల నుంచి తనతో సమానమైన కాంతిమతి అయిన ఒక నారీశక్తిని ప్రకాశింపజేసింది. ఆ పరాశక్తి బ్రహ్మదేవుని సృష్టి కార్యాన్ని జరిగేట్టు చేసింది. సృష్టి తర్వాత ఆమె తిరిగి పరమేశ్వరుడిని శరీరంలో ప్రవేశించి అర్ధనారీశ్వరి అయింది. ఆనాటి నుంచి శివుడు అర్ధనారీశ్వరుడయ్యాడు. కాళిదాసు మహాకవి పార్వతీపరమేశ్వరులను **'వాగర్థావివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే జగతః పితరౌవందే పార్వతీపరమేశ్వరౌ'** స్తుతించడానికి ఇదే కారణం.

ఒకానొక సందర్భంలో పార్వతి అలిగి తపస్సులో కూర్చున్నది. శివుడామెను బుజ్జగించి తనలో సగభాగాన్ని పార్వతికిచ్చాడు. దాని అంతరార్థం మనందరిలోనూ అర్ధనారీశ్వర స్వభావం కలగాలనెడి ఉద్దేశ్యమే! అందుకే భార్యను తనలోని అర్ధశరీరమైన అర్ధాంగిగా భావించాలి. అప్పుడు కలతలుండవు. ఇరువురి మధ్యా అన్యోన్యత పెరుగుతుంది.

**'రుద్రం రుద్రం నార్చయేత్-**

రుద్రుడైనవాడు రుద్రుని అర్చింప పనిలేదని వాక్య అర్థం. సాధకుని ఉన్నత అద్వైత సిద్ధికి పతాక. 'అహమేవ ఈశ్వరః' అను మునికి రుద్ర స్వరూపానికి రుద్రార్చనతో పనిలేదు. అతడు కౌవలుడు. కేవలం ఆత్మ సాక్షాత్కార ఆనందానుభవంలోనే కైవల్యంలో స్థిరంగా ఉంటాడు. ఇదే కైవల్య మోక్షప్రాప్తి. ఏకోరికలు కోరకుండా 'అహం శివోస్మి' అని అంతర్ముఖులై శివోపాసన చేసేవారు రుద్రుని అర్చింప పనిలేదు. 'నారుద్రో రుద్రమర్చయేత్' అని మహాన్యాసంలో బోధాయన మహర్షి వాక్యము. అంటే రుద్ర స్వరూపుడు కానివాడు రుద్రార్చనకు తగడు. మంత్ర బ్రాహ్మణాలను అధ్యయనం చేసినవాడు, వేదాలనెరిగినవాడే రుద్ర సమానుడవుతాడని మహర్షులు ఉటంకించారు. ఈ మహాన్యాసంలో మొదట పంచముఖేశ్వరుని ధ్యానం, అష్టదిక్పాలకులకు ఆహ్వానం పలికి, ఆయా దిక్కుల్లో న్యాసం చేస్తాడు. తర్వాత ఆత్మలో అంటే శరీరస్థానాలలో సర్వదేవతల్ని ఆరోపించు కుంటారు. సాక్షాత్ రుద్రునిగా తన్ను భావన చేసుకుని, హృదయంలో రుద్రుని ప్రతిష్ఠించుకొంటాడు. సర్వపాప విముక్తుడై రుద్రుడు కాగలగలడు. ఇలా చెప్పాలంటే అర్ధనారీశ్వరంలో అంతరార్థం ఎంతో ఉన్నది.








# మహాత్ముని జీవితంలో మధుర ఘట్టాలు

ఒక రోజు గాంధీజీ కూర్చుని ఏదో రాస్తుండేవారు. ఆయన పక్కన కాకా కాలేక్కర్ ఏదో పుస్తకం చదువుతుండేవారు. గాంధీజి కాకా కాలేక్కర్‌ను చూచి "ఏం చదువుతున్నారు?" అని అడిగారు.



"ఉమర్‌ఖయామ్ కవితల ఇంగ్లీషు అనువాదం, ఎడ్వర్డ్ ఫుట్‌జరాల్డ్ వ్రాసినది" అన్నారు.

"చాలా బాగుంది" అన్నారు బాపూజి.

గాంధీజి: నేనూ ఒకప్పుడు ఆంగ్ల కవితలను చదివే వాడిని. ఆ భాషపై నాకే అధికారం వుంది. నా కాలాన్ని గుజరాతీ భాష చదువు రాతకు ఎందుకు వినియోగించ కూడదు? అనుకొన్నాను. "మీరూ గుజరాతీలోనే ఎందుకు రాయకూడదు?" అడిగారు.

నాటినుండి కాలేల్కర్ గుజరాతీలో చదవడం, రాయడం ప్రారంభించారు. మరాఠీ భాషలో పండితుడైనా, కాకా కాలేల్కరు. నాటి నుండి గుజరాతి భాషలో రాస్తూ, గొప్ప గుజరాతీ రచయితగా మారారు.

గాంధీజీ శిష్యుడు జె.సి. కుమరప్ప, గాంధీజి జమాఖర్చులు రాస్తుండేవారు. లెక్కల్లో ఏ మాత్రం పొరపాటు జరిగే వీలులేదు.

1934లో బీహార్‌లో జరిగిన భూకంపంలో బాధితులకు సంబంధించిన నష్టపరిహార సమితి లెక్కలు చూచేందుకు జమ్నాలాల్ బజాజ్ జె.సి. కుమరప్పగారిని ఆ పనిని చూచేందుకు పంపారు. జె.సి. కుమరప్ప అర్థశాస్త్ర విశారదుడు.

వేలాదిమంది స్వయం సేవకులు పరిహార కార్యం సాగిస్తున్నారు. వారి ఆహారాని కోసం సుమారుగా ఖర్చులుండేవి. దీనికొక పరిమితి వుండాలని భావించి, ఏ వ్యక్తికైనా సరే 3 అణాల కంటే ఎక్కువ కేటాయించడం వీలుకాదన్నారు. ఒకమారు గాంధీజి భూకంప బాధితుల కష్టాలు, వారికి సమకూరుస్తున్న సౌకర్యాలు పరిశీలించడానికి పాట్నా వచ్చారు.

గాంధీజి పళ్ళు మాత్రమే తీసుకునేవారు. ఒక రోజు గాంధీజీకి పంపిన పళ్ళ ఖర్చు 6 అణాలకు రసీదును గాంధీజీకి కుమరప్ప పంపారు. ఆ బిల్లులో 3 అణాలు ఎక్కువగా వుందని గాంధీజి బిల్లును కుమరప్పకు వాపసు పంపారు.

విషయం తెలుసుకొని గాంధీజి మరుసటి దినం ఉపవాసం చేసి లెక్క సరిపెట్టారు.

అహింసావ్రతులైన గాంధీజి ఉక్కులాంటి గట్టి నిశ్చయం కలవారు. అట్లే బాపు హాస్య ప్రజ్ఞ కూడా కలవాడు.

గాంధీజి యరవాడ జైల్లో చాలా కాలం వున్నారు. శిక్షా కాలం ముగిసి గాంధీజి బయటకి రావడంతో దేశప్రజలు సంతోషించారు. ఎందరెందరో శుభాకాంక్షలు తెలిపారు. పండిట్ మదన్ మోహన్ మాలవ్యా "మీరు నూరేళ్ళు వర్ధిల్లాల"ని శుభాకాంక్షలు తెలిపారు.

అందుకు గాంధీజి "ప్రియమైన పండిట్‌జీ, నేను 125 ఏళ్ళు జీవించాలనుకున్నాను. మీరు 25 ఏళ్ళు కుదించారు. అయినా పరవాలేదు. ఆ పాతికేళ్ళను మీ ఆయుష్షు ఖాతాకు జమచేయండి" అంటూ బదులు రాశారు. జాబు చదువుకొన్నవారందరూ ఘొల్లుమని నవ్వారు.

మహనీయకులకు హాస్యప్రజ్ఞ సహజంగా వుంటుందని ఈ విషయం ఋజువు చేసింది.

- జానమద్ది హనుమచ్ఛాస్త్రి

# వేలం వెర్రితనం!
## వినాయకునికి ఏడువేల కిలోల లడ్డూ!




గరికపోచ పూజతో సంతృప్తిపడి గరిష్టంగా అనుగ్రహించే ఆదిపూజా అధిదేవుడు వినాయకుడు. ఆయనకు కుడుములూ, ఉండ్రాళ్ళే నైవేద్యం పెట్టాలి. వందా, వేయి కిలోల ఉండ్రం చేసి పేదవాళ్ళందరికీ ప్రసాదంగా పెడితే కుక్షిని నింపుకుంటారు. వేంకటేశ్వరునికి ప్రియమైన లడ్డూను వేల కిలోల బూందీ మిఠాయి లడ్డూచేసి, దానికో వాహనం ఏర్పాటుచేసి, ఎవరో ధనవంతుడు లక్షల్లో పాడుకుని పట్టుకువెళ్ళడం పుణ్యమా? ఆ మొత్తాన్ని బీదల కివ్వడం పుణ్యమా!

తూర్పుగోదావరి జిల్లాలోని తాపేశ్వరంలో మరోభారీ లడ్డూ తయారవుతోంది. సురుచి ఫుడ్స్ సంస్థ హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ గణపతికి 4,000 కిలోల భారీ లడ్డూ ప్రసాదం సమర్పిస్తుండగా, భక్తాంజనేయ స్వీట్స్ సంస్థ రాజమండ్రిలోని రాజమహేంద్రి ఉత్సవకమిటీకి అందజేయడానికి 7,200 కిలోల లడ్డూను సిద్ధంచేస్తోంది. ఈ లడ్డూలను చూసేందుకు ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఔత్సాహికులతో తయారీ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి. దేవునికి ఆయనకిష్టమైనవే నివేదన చేయాలి.

# అయ్యా చూపిన దారి

ఏపిజె కలాం ఒకప్పుడు రామేశ్వరంలో పేపర్‌బాయ్‌గా వుండేవారు. సాధన మరియు దృఢసంకల్పంతో గొప్ప శాస్త్రవేత్తగా, కాలక్రమంలో భారత రాష్ట్రపతి పదవి నలంకరించారు.



ఈ కథ మీకు తెలియకపోవచ్చు: దాదాపు ముప్పదేళ్ళ క్రితం, కలాం హైదారాబాద్‌లో రక్షణ పరిశోధన, ఉత్పత్తి సంస్థ (డిఆర్‌డిఎల్)లో పనిచేస్తుండేవారు. అప్పట్లో వారికో కారు డ్రైవర్ వుండేవాడు. కదిరేశన్ (కారు డ్రైవర్) కుటుంబ ఆర్థిక పరిస్థితులు కారణంగా చదువు పూర్తి చేయలేకపోయాడు. 'అయ్యాగారి దయ' వల్ల ప్రైవేట్‌గా ఎస్ఎస్ఎల్‌సి పాసైనాడు. తర్వాత వెనుతిరిగిచూడలేదు.

మదురై కామరాజ్ యూనివర్శిటీలో బిఏ, ఎంఏ పాసైనాడు. అంతటితో తృప్తి చెందలేదు. మదురైలోని మనోర్మణీయం సుందరనార్ విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పట్టా అందుకొన్నాడు. అరిన్జర్ అణ్ణా కాలేజీలో లెక్చరర్ పదవి లభించింది. "ఇదంతటికీ కారకులు అయ్యాగారే. నాకు ఉద్యోగం దొరికిందన్న విషయం కలాం గారికి తెలియదు. జాబు రాస్తాననేవాడు కదిరేశన్. కదిరేశన్ అంతకు ముందు కలాంగారి కారు డ్రైవర్‌గా ఒక ఏడాదిన్నర పనిచేశారు. కదిరేశన్‌కు స్ఫూర్తిదాత డా॥ ఏ.పి.జె. కలాం.

- జానమద్ది హనుమచ్ఛాస్త్రి

# అభినవ పోతన శ్రీమాన్ వానమామలై వరదాచార్యులు



*శ్రీ వానమామలై వరంగల్లు జిల్లా మడికొండ గ్రామంలో 1912 ఆగష్టు 16వ పండిత వంశంలో జన్మించారు. తల్లి సీతమ్మ, తండ్రి లక్ష్మీనరసింహా చార్యులు (బక్కయ్య శాస్త్రి). ఆయన సంస్కృతాంధ్ర భాషల్లో గొప్ప పండితుడు. వరదా చార్యులు గారు తన పెద్దన్న గారైన వెంకటాచార్యులు దగ్గర సంస్కృతాంధ్ర కావ్యాలు, పురాణాలు, తర్క-వేదాంత, వ్యాకరణ శాస్త్రాలు అధ్యయనం చేశారు. గ్రామంలో హరికథలు శ్రావ్యంగా చెప్పారు. చక్కని గళం ఆయన సొంతం. భారత స్వాతంత్ర్యానంతరం శ్రీ వరదాచారి అదిలాబాద్ జిల్లాలోని చెన్నూర్, కోరుట్ల ప్రాంతంలో తెలుగు పండిట్‌గా చాలాకాలం పనిచేశారు.*

**‘జలజల పూలు రాలినటుచల్లని మెల్లరి పిల్ల తెమ్మెరల్**
**తెలతెలవారి వీచినటు తియ్యని కమ్మని పాల మీగడల్**
**తొలితొలి తోడు విచ్చినటు తోరపు సిగ్గున ముగ్ధ కన్దొవల్**
**వలపుల జిమ్మునట్లు చెలువ మ్మొలికించు భవత్కవిత్వముల్”**

పోతన చరిత్రములోని ప్రసిద్ధమైన పద్యాల్లో ఇదొకటి.

ఇది పోతన చేసిన వనవర్ణన విని సింగభూపాలుడు అతని కవిత్వాన్ని స్తుతించి నప్పటి పద్యము. ఈ పద్యాన్ని శ్రీమాన్ వరదాచార్యుల కవిత్వానికి అన్వయిస్తే ఔచితీమంతంగా వుంటుంది. వరదాచార్యులు రచించిన పోతన చరిత్రము 60 (అరవై) కృతుల్లో మకుటాయమానమై, కావ్యకళాఖండమై నేటికీ రసజ్ఞుల మన్ననలు పొందుతోంది. ఇది ఆయన జీవిత కృతి. పోతనచరిత్రము ఏకనాయకమై వస్త్వైక్యంతో, అష్టాదశ వర్ణనాత్మకమై, స్వతంత్ర్య కావ్యమై అలంకారిక శైలీ ప్రౌఢత వల్ల, నవ్య భావ విలసితమై ఆధునిక మహాకావ్యంగా పరిగణింపబడుతోంది. ఒక తెలుగు మహాకవి జీవిత చరిత్రను తొట్టతొలుత మహాకావ్యంగా రచించింది వానమామలై వరదాచార్యులే. ‘అభినవపోతన’ అనే బిరుదము ఆయననే వరించింది.

స్వభావం చేత, సదాచార సంపద చేత పోతన, అభినవపోతన వరదాచార్యులు ఇరువురు ఋషితుల్యులు. వరదాచార్యుల చరిత్ర, పోతన చరిత్రకు ప్రతిబింబం. పోతనవారిలాగే వరదాచార్యులకు భాగవతము మీద అపారమైన ప్రీతి. ఇరువురూ భక్తి జ్ఞాన వైరాగ్య సంపన్నులు. వరదాచార్యులు పోతనలాగే తమ కావ్యాన్ని నరాంకితం చేయక, సొమ్ములయాసలో పడక, శ్రీరామచంద్రునికే భక్తితో అంకితమిచ్చారు. పోతన రాజభోగాలు వలచి వచ్చినప్పటికీ తిరస్కరించినట్టు కష్టాలెన్ని కలిచివైచిననూ, దుర్భరదారిద్ర్యం బాధపెట్టిననూ, చలించక సహించిన పోతన కష్టజీవి. ఆత్మాభిమానము, వైరాగ్యచిత్తము, సత్కవితా గౌరవము, ఈశ్వరభక్తి పోతనకు మెండు. వరదాచార్యుల గారి జీవితమూ కూడ చాలావరకు అప్పులతో అనేకవిధాలైన నొప్పులతో గడిచింది. జీవితంలో ఇరులు పరచుకొన్నప్పటికీ, అంతరంగంలో విరులనే నింపుకొని, విరులు విరసిన రోజుల్లో ఇరులను కూడా కోరుకొని, కన్నీటిని, పన్నీటిని సమదర్శనము చేసిన స్థితప్రజ్ఞులు. కామక్రోధాదులను నిర్జించిన శమదమాది షడ్గుణసంపద్విరాజితులు. పలుకులో మార్దవము, అవగాహనలో ఆర్ద్రత, మాటలో మన్నన ఆయన ఎదగని వాళ్ళని కూడా ఆకర్షిఇంచే లక్షణాలు. నిరాడంబరులు నిష్కల్మషులు. కీర్తి ప్రతిష్టల కోసము పరుగులు లేవు; పట్టీలులేవు. పోతనకు శ్రీరామ తారక మంత్రోపాసన సిద్ధివల్ల అబ్బిన సహజ పాండిత్యము లాగే అభినవపోతన వరదన్నకి వాగీశ్వరీ మహామంత్రోపాసన సిద్ధి వల్ల అబ్బిన పాండిత్యముతో నిండుతనము చేకూరింది. సంసార జీవితాన్ని గడిపిన పోతనవలె అందులోనే మునిగిపోక పద్మదళ విలసిత తుషారబిందు సందోహంలా అంటీ అంటనివారై సదసద్వి వివేకవంతులైన వైరాగ్య జీవనులు.

**పోతన కావ్య గానంతో “కోకిలల్ వలచును;**
**హంసముల్ తలలు వంచును;**
**డోలలదేవి చేతముల్;**
**తలలివ నాగుబాముల విధమ్ముగా నూగును;**
**దేహమున్నటుల్ తెలియదు;**

డిగ్రీలు లేని పాండిత్యము వరదన్నది. అయినా ఆనాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు నిజామాబాద్ జిల్లా దోమకొండలో గల ప్రభుత్వ జనతా కళాశాలలో ఒక ప్రత్యేకమైన ఉత్తర్వు ద్వారా ఉద్యోగం కల్పించి, జీవనాధారం కల్పించి మహోపకారం చేశారు. తీవ్ర ఆర్థిక సంక్షభంలో చిక్కినా, క్షయ వ్యాధితో చిక్కి శరీరం శల్యావశిష్టమైనా, అచంచల దీక్షతో రచనా నిమగ్నులై పోతన చరిత్రను 1956లో పూర్తి చేసినా 1966 వరకు ఈ మహాకావ్యము ప్రచురణకు నోచుకోలేదు. వరదాచార్యులు పోతన చరిత్ర రచనకు పన్నెండు (12) సంవత్సరాలపాటు శ్రమిస్తే దాని ప్రచురణకు పది (10) సంవత్సరాల కాలం శ్రమించవలసివచ్చింది.

ఆ దుస్థితిలో వరదాచార్యులు అభ్యర్థనకు స్పందించి ఆనాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పద్దెనిమిది వేల రూపాయలు (18,000) ఈ కావ్య ముద్రణకై ప్రత్యేకమైన ఉత్తర్వు ద్వారా మంజూరు చేశారు. కానీ ఆ డబ్బు పొందడంలో జరిగిన ఆలస్యం వల్ల తర్వాత ఏర్పడిన ప్రభుత్వం ఆ ఉత్తర్వును రద్దు చేసింది. ఆ పరిస్థితిని గమనించిన సాహిత్యాభిమానులు వరదాచార్యుల కావ్య, గాన, సన్మాన సభలను రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, విరాళాల ద్వారా ఎనిమిదివేల రూపాయలు (8,000) ప్రోగుచేసి ఆచార్యుల వారికి సమర్పించారు. అయినా ఆ డబ్బు సరిపోక కావ్య ముద్రణ మరోసారి ఆగిపోయింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాశాఖ పదివేల రూపాయలు (10,000) మంజూరు చేసినందున ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శి దేవులపల్లి రామానుజరావు నేతృత్వంలో ఆంధ్ర సాహిత్య పరిషత్తు భవనంలో 1967 ఏప్రిల్ 14నాడు పోతన చరిత్ర మహాకావ్య ఆవిష్కరణోత్సవం నిర్వహింపబడింది. పోతనలాగే అభినవ పోతన వరదాచార్యులు దారి తప్పి పడిపోతున్న మానవ జీవిత శకటాన్ని సముద్ధరించటానికి కలం, హలం చేతబూనిన కర్మయోగి, కర్షక సత్కవి. పోతన భోగిని శిలాన్నీ నృత్య సంగీత కళలను, మధుర భక్తి భరిత నాట్యాన్ని చూసి పరవశించి భోగినీ దండకాన్ని వ్రాసినట్లే వరదాచార్యులు భోగినీ నృత్య వర్ణన ఘట్టాన్ని పోతన చరిత్రములో శాస్త్రీయంగా, సాంప్రదాయకంగా సాగినట్లు, నాటకంలో అంతర్నాటిక లాగా సాగేలా మధుర మంజుల కవితామయం చేశారు. భోగినీ నృత్యఘట్టాన్ని గానం చేస్తున్నప్పుడు అమృతం వర్షించినట్లుగా ఉండేది.

“శ్రీమద్భాగవతాంధ్రీకరణ పోతన చేత బడుట ఎట్టిదో, పోతన చరిత్రము వరదచార్యుల వారిచేత బడుట అట్టిదేయని” ఆచార్య దివాకర్ల వెంకటావధాని వరదన్నను ప్రశంసించారు.

అభినవ పోతన వరదాచార్యులు రచించిన మహాకావ్యానికి 1968వ సంవత్సరములో రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. శాసనమండలి సభ్యులుగా ఆరు (6) ఏళ్లపాటు కొనసాగినా, ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు పౌరులు సువర్ణాభిషేకం చేసి సన్మానించారు. ఆనాటి ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు వరదాచార్యుల పాదానికి గండపెండేరం అలంకరించారు. విద్వద్వరేణ్యులు ఆచార్య దివాకర్ల వెంకటావధాని వరదాచార్యుల చేతికి స్వర్ణకంకణం తొడిగారు. సాహిత్యాభిమానులు వారికి రత్నాభిషేకం చేసి, ‘కవితంస’; ఉత్ప్రేక్షా కవి చక్రవర్తి”, ‘మహాకవి శిరోమణి’, ‘అభినవ కాళిదాసు’ ఇత్యాది బిరుదులెన్నో యిచ్చారు. ఏ అభిలాషలు లేని, ఏ ఆపేక్షలు లేని నిత్య సంతోషి వరదాచార్యులు.

“విత్తము విభవము లేకున్నను, చిత్తములో కావ్య చింతనమున్న చాలును. అదే నాకు బ్రహ్మానందం. అదే జన్మ జన్మల అనుబంధం. దీనిని విడచిన త్రిలోకాధిపత్యమిత్తుమనిననూ, నాకు వలదు. నాకు గల ఐమికాముష్మిక సుఖసర్వస్వము ఇదియే” యని పలికిన వరదాచార్యులు భౌతికంగా ఇప్పుడు లేరు.కానీ వారు ఎందరో సాహిత్యాభిమానుల హృదయాల్లో సుప్రతిష్టులైవున్నారు. అయ్యగారి పుట్టిన రోజు ఆగస్టు 16, 1912.

**(కె.వి. రమణాచార్యులు వారికి కృతజ్ఞతలు)**

# తామసాన్ని అణచుకోవడం కూడా ఒక తపస్సే!

కె. మల్లికార్జున, బళ్ళారి

బ్రహ్మదేవుడు ఆరంభంలో సృష్టించే విధానం తెలియక కుపితుడైన సమయంలో కనుబొమలనుంచి ఉద్భవించిన రూపమే 'రుద్రుడు' అని పురాణం చెబుతున్నది. నవరసాల్లో రౌద్రానిది శాంతరసంకన్నా ముందు స్థానం. దుష్టశిక్షణార్థం దివినుంచి భువికి దిగివచ్చిన అవతారమూర్తి రుద్రుడు. సమయోచితంగా సత్యాగ్రహాన్ని ప్రదర్శించి ఉండకపోతే శిష్టరక్షణ సాధ్యమై ఉండేదా అన్నది ప్రశ్న!

నారదమహర్షికి సనకమహాముని ఇచ్చిన వివరణ ప్రకారము కలియుగం మరోపేరు తామస యుగం. త్రేతాయుగంలోనే శ్రీరామచంద్రుడంతటి శాంతమూర్తికి వారధి నిర్మాణం వేళ సముద్రుడిమీద ఆగ్రహం పుట్టుకొచ్చింది. ద్వాపరయుగంలో కురుక్షేత్ర సంగ్రామం మూలాలు దుర్యోధనుడి వంటి దుష్టుల మదమాత్సర్యాల్లో ఉన్నాయి. రజోగుణజనితాలైన కామక్రోధాలే సర్వపాపాలకు మూలకారణమని గీతాచార్యుడే ప్రబోధించాడు. ఆయనే రాయబారం వేళ **'అలుగుటయే ఎఱుంగని మహామహితాత్ముడు అజాతశత్రుడే యలిగిననాడు సాగరములన్నియు నేకముగాకపోవు'** అంటూ యుద్ధ తంత్రంలోని దండోపాయాన్ని ప్రయోగించాడు.

అలకచే సత్యభామ పడకటింటి కోపతాపాలే నందితిమ్మన 'పారిజాతాప హరణం' గ్రంథ పరిమళ సౌరభాలు. సాక్షాత్ ఆ శ్రీమన్నారాయణుడి కరుణాకటాక్షం వల్ల పునరుజ్జీవితుడైన పరీక్షిత్ మహారాజు శమీక మహర్షి తనను నిర్లక్ష్యం చేశాడన్న ఉక్రోషముతో మృత సర్పాన్ని మెడలో వేసి చావుని కొనితెచ్చుకొన్నాడు. తండ్రికి జరిగిన అవమానానికి కుంగి శాపానికి పూనుకొన్నాడు శృంగి. ఆ సందర్భములో తండ్రి శమీకుడు అన్నమాటలు నిజానికి సర్వకాలాలకూ, సర్వలోకాలకూ హితాన్ని కలిగించే చద్దిమూటలు. త్రాచువంటి మూగజీవులకు కేవలం ఆత్మరక్షణాయుధమైన క్రోధంతో మేధావి మనిషి కార్యాలన్నింటిని సాధించుకోవాలనుకుంటే ముందు నష్టపోయేది తానూ, తనచుట్టూ ఉన్న సమాజం.

దమయంతి కల్యాణం నలుడితో జరిగిందని విన్న, ద్వాపరుడు కోపంతో చిందులు వేసే సందర్భంలో వారి సేనా నాయకుల అరిషడ్వర్గాలు ఒక్కొక్కరే తమ ప్రతాపాలను ఉగ్గడించుకొనే సన్నివేశం మహాభారతంలో ఉంది. కాముడి కారుకూతల తరువాత క్రోధుడు "నా దుర్గం ఈ కామునికైనా దుర్భేద్యం. కాముని ఆశుగాలు ఈ క్రోధుని ముందు బలాదూరు' అనే కోతలు చాలు. దుర్వాసమానస పుత్రుడు మానవజీవితంలో చేసే అలజడులు, ఆగడాలు, విధ్వంసాలు వివరించడానికి **కలికితురాయి నీకు పొలుపుగా చేయిస్తి రామచంద్ర! నీవు కులుకుచు దిరిగెదవెవరబ్బ సొమ్మని రామచంద్ర!** అంటూ దాసుని చేతనే స్వామిని తిట్టిపోయించే గడుసుదనం దానిది. సిగ్గుఎగ్గులు లేక ఏకచక్రపురాన భిక్షాటనము చేసి వెలగలేదే" అని పాండవపక్షపాతే అధిక్షేపించగా "నల్లపిల్లవలె ఇల్లిల్లు గాలించి పాలను దొంగిలి ప్రబలలేదో!" అంటూ ఆ పాండవమధ్యముడు ఎదురుమాటాడు. ఆ రచ్చంతా ఎంత ఆంతరంగికుల మధ్యనైనా చిచ్చుపెట్టించగల ముచ్చు క్రోధానిదే!

ఉత్తమకావ్య రసాస్వాదన చేయలేని అశక్తుల మీద యథాశక్తి కసి తీర్చుకోవ దానికి నన్నెచోడుడు ఎన్నుకొన్న మార్గం ప్రబంధ లక్షణమన్న వంకతో కుకవి చేసిన నింద, మదమాత్సర్యాలకు, కోపతాపాలకు కొరతలేని సృజన రంగంలో తిట్టుకవిత్వం" పేరుతో ఇల్లుకొట్టుకుపోగా పొట్టుగా మిగిలిన సాహిత్య సరకే గుట్టలు గుట్టలు. "నీ పేరెమిటిని" అడిగిన నేరానికే "వట్టిమానైన చిగురు బుట్టింప గిట్టింప బిరుదుగల వేములవాడ భీమకవినే గుర్తించలేవా" అంటూ చాళుక్య చొక్కరాజు అంతటి వాడిమీద తాడిచెట్టంత ఎత్తున ఎగిరిపడే కవులు కొదువలేదు. వాక్పారుష్యం దహనం కంటే దారుణమన్న నన్నయ శాంతి ప్రవచనాలు చెవిన పెట్టకపోతే చెడేది ముందు మన ఆరోగ్యాలే!

మనిషి దేన్ని పరిత్యజించి శోకరహితుడవుతాడని యక్షుడు అడిగిన ప్రశ్నకు యుధిష్ఠరుడు ఇచ్చిన సమాధానం: క్రోధం మనిషి జీవితం శోకమయం కావడానికి కోరికలే కారణం అన్నాడు. బుద్ధ భగవానుడి ప్రబోధం : తీరిన కోరికలు మరిన్ని కోరికలకు ప్రేరణలవుతాయి. తీరని కోరికలు క్రోధానికి కారణాలవుతాయి అంటుంది భగవద్గీత.

కోపమునకు ఘనత కొంచమై పోవును. కోపమునకు మిగులగోడు చెందదు. కోపమడచెనేని కోరికలీడేరు" అన్నది వేమనమాట. భూమి నుంచి సహనం, వాయువు నుంచి పరోపకారతత్త్వం, ఆకాశం నుంచి కాలాతీతమైన గుణస్థిరత్వం, నీటినుంచి నిత్యస్వచ్ఛత, అగ్ని నుంచి పునీతమయ్యే గుణం అలవరచుకోవడానికే పంచభూతాలనే ప్రసాదాన్ని మనిషికి ప్రకృతి బహూకరించింది.

ముక్కుమీద కోపం మానవుని అందం అని, ముప్పొటలా ముటముటలాడతా మంటే మొదటగా వచ్చేవి మన ఆరోగ్యానికే ఆటంకం అంటున్నారు వైద్యశాస్త్రజ్ఞులు. కాన్ కార్డియా విశ్వవిద్యాలయ పరిశోధకులు మానవ జీవన ప్రమాణాలమీద 15 సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రయోగాల్లో కోపగుణం- రక్తపుపోటు, నిద్ర, మానసిక ఒత్తిడి, హార్మోన్లు, శరీరావయవాలు, జీర్ణకోశం మొదలైనవాటిపై తీవ్ర ప్రతికూల ప్రభావం కనిపిస్తుందని శాస్త్రీయంగా ఋజువు చేసారు. అనివార్యమైనప్పుడు కోపాన్ని ఆవేశపూరితంగా కాక, అర్థవంతంగా, సున్నితంగా ఎదుటివారు అర్థంచేసుకునేటంత తగు మోతాదులో వ్యక్తం చేయడం ఆరోగ్యవంతమైన మార్గమని పరిశోధకులు అంటున్నారు. పేలుళ్లు, పెను విస్ఫోటనాల వంటి దుస్సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, విశ్వవ్యాప్తంగా ప్రతి వ్యక్తీ తన మనసును స్వర్గధామంగా మలచుకొనే ప్రయత్నం ఆరంభించాలి. **"కోపాన్ని అణచుకోవడం గొప్ప యజ్ఞం చేసినంత ఫలం.** అనిన తాళ్ళపాక తిరుమలాచార్యులవారి తత్త్వాన్ని ఒంటబట్టించుకోండి. ఇంటికీ, ఒంటికీ సమాజానికీ, దేశానికి, విశ్వానికీ మేలు జరుగుతుంది! ●


బలం చేకూర్చి, భయం, పిరికి, పిశాచ, సర్వదోషాలను నివారించే

నరసింహ స్వామి ఉంగరం

ధర రూ. 400/- మాత్రమే

Narasimha Swamy Ring





:09840259871, 04424837505

BAKTHITODAY PAVITHRA SAAMAGRI PARISODHANA NILAYAM

www.bakthitoday.blogspot.com : www.indiamart.com/bakthitoday-pavithra



We Provide your comfortable Stay and Tasty Food

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com



# శ్రీ భగవద్గీతా మకరందం!



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

83

## పదమూడవ అధ్యాయము - క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము

**27. యావత్సంజాయతే కించిత్సత్త్వం స్థావరజఙ్గమమ్**
**క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్తద్విద్ధి భరతర్షభ.**

**వ్యాఖ్య:-** ప్రపంచమున ఏ వస్తువు కూడ, వ్యక్తి కూడ క్షేత్రజ్ఞుడగు పరమాత్మయొక్క సంయోగములేనిదే ఉద్భవించదని తెలుపబడుటవలన, చరాచరములగు సమస్త ప్రాణికోట్లయందును భగవానుని అస్తిత్వమును కలదని నిశ్చయించి సర్వభూతదయ గలిగి వర్తించవలెను. భగవంతుడు రాతియందున్నాడా? అను ప్రశ్నకు భగవానుని సంయోగములేనిచో అసలు రాయియే ఉద్భవించదని గీత చెప్పుచున్నది. స్థావరమగు రాతి విషయమే ఇట్లుండ నిక జంగమమగు మనుష్యాది ప్రాణికోటి విషయమై వేఱుగ చెప్పవలెనా! కాబట్టి చెట్టుయందు, పుట్ట యందు, రాతియందు, చీమయందు, పక్షియందు, మృగమునందు, మనుష్యుని యందు, చండాలునియందు, బ్రాహ్మణునియందు, రాక్షసునియందు, దేవతలయందు పరమాత్మ నివసించుచున్నారను విశ్వాసము కలిగియుండవలెను.

**28. సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్**
**వినశ్యత్స్వవినశ్యన్తం యః పశ్యతి స పశ్యతి.**

**వ్యాఖ్య :-** భగవానుడు కొందఱియందు హెచ్చుగను, కొందఱియందు తక్కువ గను లేరు. పుష్పములందు దారమువలె సమస్త ప్రాణికోటియందును, సమముగ వ్యాపించియున్నారు. (సమమ్). మఱియు 'సర్వేషు' అను పదముచే ఏ ఒకానొక ప్రాణిలో మాత్రముండుట కాదనియు, విశ్వమందలి సమస్త భూతకోట్లయందును భగవానుడధివసించుచున్నాడనియు స్పష్టముగుచున్నది.

*'వినశ్యత్స్వవినశ్యన్తమ్'*- దేహాద్యుపాదులు నశించినను అందున్న ఆత్మ, పరమేశ్వరుడు నశించుటలేదు- అని తెలుపబడినది. దీనిని బట్టి దేహాది దృశ్య ప్రపంచమంతయు నాశశీలమైనదియు, నశింపనివస్తు వొక ఆత్మయే యనియు స్థిరపడుచున్నది. కావున అట్టి నశ్వరదేహాదిపదార్థములందు మమత్వములేక శాశ్వత ఆత్మవస్తువు కొఱకే అన్వేషింపవలయును.

*'యఃపశ్యతి సపశ్యతి'* - దేహాద్యుపాదులు నశించినను ఆత్మ నశింపదని చూడ గల్గువారే నిజముగ చూడగలవారని యిట పేర్కొనబడినది. కాబట్టి ఈ సత్యమెఱుం గని వారందఱు నేత్రములున్నను వాస్తవముగ నేత్రవిహీనులేయని పై భగవద్వాక్యముల వలన స్పష్టమగుచున్నది. స్థూలనేత్రములేనివాడు - అతడెంతటి లౌకిక విద్యావేత్త యైనను, ధనికుడైనను, సుందరుడైనను, బలవంతుడైనను, అధికారవంతుడైనను, రాజాధిరాజైనను - భగవానుని దృష్టిలో గ్రుడ్డివాడే యని తేలుచున్నది. కావున భగవత్ప్రతిపాదితమగు ఈ సూత్రప్రకారము ప్రతివారును తాము వాస్తవముగ నేత్రములు కలవారా, లేనివారా యని చూచుకొని అజ్ఞానాంధత్వమును తొలగించుటకై ప్రయత్నించవలెను. భౌతిక నేత్రములతోబాటు జ్ఞాననేత్రములను గూడ సంపా దించుకొనవలెను. దేహాది దృశ్యపదార్థములను నాశవంతములుగను, ఆత్మను శాశ్వతముగ నెఱుంగగల్గుటయే జ్ఞాననేత్రమును సంపాదించుట యగును.

**29. సమం పశ్యన్హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్**
**న హినస్త్యాత్మనాఽఽత్మానం తతో యాతి పరాంగతిమ్.**

**వ్యాఖ్య:-** సమం, సర్వత్ర, సమవస్థితమ్- అను మూడుపదములను ప్రయో గించుటవలన భగవంతుడు (1) సమానముగా వర్తించుచున్నారనియు (2) సర్వత్ర వర్తించుచున్నారనియు (3) లెస్సగా వర్తించుచున్నారనియు తెలియుచున్నది. ఈ ప్రకారముగా పరమాత్మను సమస్తప్రాణులందును సమముగ వీక్షించువాడు ఆ పరమాత్మను ప్రయత్నపూర్వకముగ నెట్టైనను తెలిసికొనుటవలన తన ఆత్మను తాను చంపుకొనుట లేదని తెలియుచున్నది. ఆత్మను తెలిసికొనకపోవుటయే ఆత్మను హింసించుట. అదియే 'ఆత్మ'హత్య. మఱియు ఆత్మ నెఱుంగనివాడు జనన మరణ సంసారప్రవాహమునబడి కొట్టుకొనిపోయి నానాబాధలు పడుటవలనను తన ఆత్మను తాను హింసించుకొనినవాడేయగును. కావున వారివారి సంసారబాధలకు వారే కారకులని స్పష్టమగుచున్నది. ఆత్మను తెలిసికొనినచో ముక్తుడగుటచే ఆ బాధలెవ్వియు లేకుండును. కావున విజ్ఞులగువారు తమ ఆత్మను హింసించుకొనక, ఆత్మహత్యకు గడంగక, సర్వత్ర సమముగ వ్యాపించియున్న పరమాత్మనెఱింగి తత్ఫలితముగ సర్వోత్తమమగు మోక్షగతి నొందవలయును. మోక్షమును *'పరాంగతిమ్'*(ఉత్తమగతి) యని చెప్పుటవలన ప్రపంచములో గల పదవులన్నిటిలోను ఆత్మసాక్షాత్కారస్థితియే సర్వోత్తమమని తెలియుచున్నది.

**30. ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః**
**యః పశ్యతి తథాఽఽత్మానమకర్తారం స పశ్యతి.**

**వ్యాఖ్య:-** లోకములో సర్వత్ర సమస్తకర్మములను ప్రకృతియే జరుపుచున్నది. ఆత్మతటస్థుడుగ, సాక్షీభూతుడుగనున్నాడు. వాస్తవముగ అతడు కర్తకానేరడు. ఆతని సాన్నిధ్యమహిమచే ప్రకృతియే క్రియలన్నిటిని సర్వవిధముల నెఱవేర్చుచున్నది. ఈ సత్యము నెఱుంగువాడే వాస్తవదృష్టిగలవాడు. ఆతడే నిజముగ చూచువాడు. తక్కినవారు నేత్రములున్నను సత్యమును గాంచజాలనివారని అర్థము. ప్రపంచమున చాలమంది కర్తృత్వాదులను ఆత్మయందే ఆరోపించి 'నేను చేయుచున్నాను, నేను దుఃఖించుచున్నాను'- ఇత్యాదివాక్యములను పలుకుచున్నారు. వారు యథార్థమును చూచువారు కాదు. నేత్రములు గలిగియున్నను వారు సత్యమును గాంచజాలనివారు. కావున ఇట్టి జ్ఞాననేత్రమును సంపాదించుకొనవలెను. లేకున్నవారు భగవద్దృష్టియందు నేత్రవిహీనులే యగుదురు. వారు అంధకారమునందు (అవిద్యయందు) జీవించువారే యగుదురు.

**31. యదా భూతపృథగ్భావమ్ ఏకస్థమనుపశ్యతి**
**తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా.**

**వ్యాఖ్య:-** అనేక ప్రాణికోట్లతో గూడి వేర్వేఱుగా కనిపించు ఈ జగత్తు వాస్తవముగ ఒకే స్వరూపమై యున్నది.

ఒక పరమాత్మయందది వేర్వేఱుగ కల్పింపబడినది. కావున ఈ వేర్వేఱు రూపములు సత్యములు కావు. అవి దేనియందు కల్పింపబడినవో, అట్టి ఆత్మయే సత్యమైనది. ఈ రహస్యము నెపుడెఱుంగునో అపుడు మనుజుడు బ్రహ్మమునే పొందుచున్నాడు లేక బ్రహ్మముగనే అగుచున్నాడు.

*'అనుపశ్యతి'*- *'పశ్యతి'* అని చెప్పక *'అనుపశ్యతి'* అను చెప్పుటవలన అట్టి ఏకత్వమును మాటిమాటికి అభ్యాసము ద్వారా లెస్సగ చూడవలెనని భావము.

*'బ్రహ్మసంపద్యతే తదా'*- మనుజుడు మోక్షము నెపుడు పొందగలడో ఆ సుము హూర్త మిచట తెలియజేయబడినది. అది ఒకానొక నిర్దిష్టసమయము కాదు. ఏ సుముహూర్తమం దాతడు భిన్నభిన్న రూపములతో గూడిన ఈ జగత్తును ఏకమగు పరమాత్మయందు కల్పింపబడియున్న దానినిగను దాని నుండియే విస్తరించిన దానినిగను తెలిసికొనునో, ఆ ముహూర్తమందే యాతడు అట్టి బ్రహ్మజ్ఞానముచే బ్రహ్మమునే పొందుచున్నాడు. (బ్రహ్మమందు లయమై బ్రహ్మరూపుడుగనే శేషించు చున్నాడు. అదియే మోక్షము)

దీనిని బట్టి ఈ ప్రపంచమున అనేకత్వమును జూచుట బంధలక్షణమనియు, ఏకత్వమును చూచుట మోక్షలక్షణమనియు స్ఫురించుచున్నది. కావున విజ్ఞుడగువాడు నామరూపములను విడనాడి సచ్చిదానందములను గ్రహించుట ద్వారా అనేకత్వ మన ఏకత్వమును వీక్షించుటను అభ్యసించవలయును.

*(తరువాయి వచ్చే సంచికలో)*



సి నారాయణరెడ్డి విషయానికి వచ్చినపుడు ఆయనకు 83 ఏండ్లా, 38 ఏండ్లా అనే సంశయం కలుగుతున్నది. దాదాపు అర్ధశతాబ్దపు పరిచయం నాకున్నది. నారాయణరెడ్డి, దాశరధిలొకేసారి మద్రాసు తెలుగు సినిమా రంగంలో ప్రవేశంచినట్లు గుర్తు. ఇరువురూ నాకు రెండు కళ్ళు– నన్నెంతగానో ప్రేమించినవారు. **సినారె** సిరిమల్లెపూవు వంటి మనసూ వచస్సూ కలవాడు – అలాగే యశస్సూ పెంచుకుని జ్ఞానపీఠ అవార్డుచే వరింపబడిన రెండవ తెలుగుకవి. కేంద్ర ప్రభుత్వంచే పద్మభూషణ్ అవార్డుతో గౌరవింపబడినవాడు. ముందుముందేమైనా 'నోబుల్ సాహితీ' అవార్డును గ్రహించినా గ్రహించవచ్చు. ఆయన సహజంగా గజల్స్ పాడుతూ ఊగిపోతాడు. ఇహ కవిత్వమా నలభీమపాకం. ఆయనొక కవితలో–

**ప్రస్తుతం నా కళ్ళముందున్న ప్రబల లక్ష్యం! ఎగబీల్చే శ్వాసలో ఈ సమస్త విశ్వాన్నీ ఇమిడించుకోవడం!**–అంటూ, మరొకచోట– **'నెత్తి గోక్కుంటే కొత్త ఊహలు పుట్టవు– మేధా నిలయాన్ని ఎప్పటికప్పుడు మధించుకుంటూ పోతే తప్ప'** అంటారు.

సరళమైన భాష, సరసమైన భాష, సమసరస వ్యాఖ్య, ఒక్కొక్క పదాన్ని కూర్చుకుంటే పోతే పసుపు రాసి, పారాణిపూసి, మువ్వలు కట్టి నడిచే సత్యభామ పాత్రలా ఉంటుంది. **కొన్ని జ్ఞాపకాలు పూలరేకుల్లా విచ్చుకుంటాయి. మరికొన్ని గుండె సూదుల్లా గుచ్చుకుంటాయి.**– అంటారు.

నిజానికి అలా గుచ్చుకోని మన్మధ చెరకు విల్లు, పూలబాణం వంటి సినారె నిండు పూర్ణిమలా నిండు నూటయిరవైఏండ్లూ కవితా వసంతంతో 'తెలుగు'ను విరబూయించాలని, మా ఏలిక కౌసల్యా సుప్రజా రామ స్వరూపుడైన వెంకటేశుని వేడుకుంటున్నాం. ఇలాటి కార్యక్రమాలకు సారధ్యం వహించే 'వంశీ'వారినీ, సహక రించే తిక్కవరపు సుబ్బరామిరెడ్డినీ అభినందిస్తున్నాం. ●

## తేనియలూరు తేట తెలుగును వినాలన్నా చదవాలన్నా

# సి.నారాయణరెడ్డి కి సములు లేరు!

ఆయన కవితాధార క్షీరసాగరం వంటిది. పోతన, ఎర్రాప్రెగడ, విశ్వనాథ, జాషువా తరువాత వచ్చిన జాణ తెలుగు కవి సి. నారాయణరెడ్డే! ఆశువుగా చెప్పినా, ఆనందంతో చెప్పినా, సరిగమ గణకాలవోలె లయ తప్పకుండా, ఊర్వశిలా భాషణం హొయలొలుకుతూ ఉంటుంది. రాగం, తానం పల్లవిలా భీంపలాసు రాగం వింటున్నట్టు ఉంటుంది. ఆయన పద్యం చెప్పినా, గద్యం చెప్పినా, పాట చెప్పినా శ్రవణేంద్రియాలు సరసోల్లాసోలు చేస్తూంటాయి. నిజంగా ఆయనొక వాగ్గేయకారుడు. వాగ్విభవుకుడు, వాగ్భూషితుడు. పగలు చల్లని వెన్నెలలు కురిపించ గలడు. నల్లని శిలలందు నేత్రాలు విప్పి చూపగలడు. తెలుగునేలను తన అక్షర గుచ్ఛంతో పూలవనంలా పల్లవింపచేసే ఈ జ్ఞానపీఠ రసరాట్టును సాహితీ సామ్రాట్ అనవలెనా, సంగీత సామ్రాట్ అనవలెనా!

నేను నిర్మించిన 'రైలు దోపిడీ'లో నాలుగు పాటలు రచించి,నాలుగు దిక్కుల్లోనూ నర్తనశాల ల్లూగింప చేసాడు. ఉల్లాసంలో దోగాడ చేసాడు. ప్రతీపుట్టిన రోజునా ఓ పద్య కావ్యం రచించి, ఆవిష్క రింప చేయడం సి.నా.రే ఆచారం. ఈ సంవత్సరం ఆయనతోబాటు ఆయన మనుమరాలు చి॥ వరేణ్యరెడ్డి 13 ఏండ్ల వయసులో తన తాతగారి పుట్టినరోజున 'బీమింగ్ రిఫ్లెక్షన్స్' అని ఆంగ్లంలో రచించిన కవితా సంపుటి గ్రంథాన్ని వెలువరించడం విశేషం. **2000** సం॥ము జూలై నెలలో (అది అమెరికాకు స్వాతంత్ర్యం తెచ్చిన స్వతంత్ర పండుగలు జరుపుకునే నెల) అమెరికాలోని న్యూజెర్సీలో జనించిన యీ చిట్టితల్లి 13వ వయసులో ఎన్ని భావాలు వికసించి యీ గ్రంథం వ్రాసిందో! ఇంట్లో అమ్మకు యిష్టమైన వస్తువు పగులకొట్టి ఎలాటి తిట్లు తింటామో– అనే చిలిపి భావనపై ఒక కవిత్వం, ఎంతో మక్కువతో ఆశించిన వస్తువు దక్కకపోయినపుడెలా ఉంటుందీ – అని మరో వ్యాసం, తాతకు తగ్గ మనుమరాలుగా జీవితానికి సన్నిహితంగా ఉండే ఇలాటి సంఘటనల్తో ఆంగ్లంలో వరేణ్య వ్యాసాలు వ్రాసిందంటే సహజత్వానికి బంగారు తొడుగులు తొడిగినట్టుగా ఉన్నది. ఈ పసిడి నవ్వుల వరేణ్యరెడ్డికి మా శుభాశీస్సులు. మల్లె చెట్టుకు మల్లెపూలుగాక మరేంవిపూస్తాయ్!

# ఆంధ్రప్రదేశ్ పౌరులు చావుపుట్టుకల మధ్య సందేహం లాంటి జీవితం గడుపుతున్నారు!

